మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్
ఆదివారం 12 ఏప్రిల్ 2026
పేజీ : 1

# అమీన్‌పూర్‌లో హైడ్రా ఆపరేషన్

**కోర్టు ఉత్తర్వులు బేఖాతరు చేసిన భారీ కట్టడాల కూల్చివేత**




03

## కొత్తతరం నాయకత్వం

# రావాలి

### అరాచక పాలన అంతానికి యువత ముందుకు రావాలి



రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న అరాచక పాలనను అంతమొందించేందుకు కొత్తతరం నాయకత్వం నడుం బిగించాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అవి కేవలం సాధారణ అసెంబ్లీ ఎన్నికలు కాదని, కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే ఎన్నికలుగానే ఉంటాయని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో రైతులు, నిరుద్యోగులు, మహిళలను నిలువునా వంచిస్తోందని మండిపడ్డారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని, స్థానిక ఎమ్మెల్యే వసూళ్ల పర్వం చివరకు అరటి పండ్ల బండ్ల వరకు చేరిందని ఎద్దేవా చేస్తూ.. కార్యకర్తలు ప్రజా క్షేత్రంలో పోరాడాలని దిశానిర్దేశం చేశారు.

వివరాలు 2లో..

- రాబోయేవి అసెంబ్లీ ఎన్నికలు కాదు.. కేసీఆర్ ఎన్నికలే
- అబద్ధపు హామీలతో రేవంత్ సర్కార్ డబ్బా
- నిరుద్యోగులు, రైతులను మోసం చేసిన కాంగ్రెస్
- ఇబ్రహీంపట్నం కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

## పూలేకు సీఎం రేవంత్ రెడ్డి నివాళి

**ఢిల్లీ నివాసంలో ఘనంగా జయంతి**

**పాల్గొన్న ఎంపీ మల్లు రవి**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 (మనసులో మాట):** మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీలోని తన నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుడి ఉన్నత్యాన్ని గుర్తుచేసుకున్నారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఎంపీ మల్లు రవి కూడా నివాళులర్పించారు. సామాజిక సమానత్వం కోసం పూలే చేసిన కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు.





## వర్ణ వివక్షపై పోరాటం ఆదర్శనీయం

- బీఆర్ఎస్ పాలనలో పూలే ఆశయాల సాధన
- సామాజిక విప్లవకారుడు పూలేకు కేసీఆర్ నివాళి

04

## 20న మోతెలో కేసీఆర్ భారీ సభ

**ఏర్పాట్లను పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు**

వివరాలు 2లో..



04

# దక్షిణాది గొంతు నొక్కే కుట్ర

**ఉత్తరాదిలో ఎంపీ సీట్లు పెంచేందుకు కేంద్రం ప్లాన్**

**పన్నులు మనవి.. నిధులు వాళ్లకా?: భట్టి విక్రమార్క**

# అక్షరాస్యతలో వెనుకబడిన తెలంగాణ

**విద్యా రంగం పూర్తిగా అస్తవ్యస్తం**

**పూలే ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు**

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**



05

# గురుకుల వ్యవస్థ నిర్వీర్యం

**కాంగ్రెస్ పాలనలో విద్యాసంస్థలు భ్రష్టు పట్టాయి: ఎర్రోళ్ల శ్రీనివాస్**

**హైదరాబాద్, ఏప్రిల్ 11 (మనసులో మాట):** కాంగ్రెస్ పాలనలో గురుకుల విద్యావ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిందని బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ మండిపడ్డారు. గురుకులాలపై ఒక్క రోజైనా సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష చేశారా అని ప్రశ్నించారు. కేసీఆర్ ఎంతో కష్టపడి సృష్టించిన గురుకులాల బ్రాండ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం చేస్తోందని విమర్శించారు. పేద విద్యార్థులంటే ముఖ్యమంత్రికి ఎందుకంత ద్వేషమని ఆయన నిలదీశారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడానికే గురుకులాలను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రికి విద్యార్థుల ప్రాణాలంటే లెక్కలేదా అని ప్రశ్నించారు. ఎన్నికల కోసం వేల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం.. గురుకులాలకు మాత్రం రూపాయి కేటాయించడం లేదని ధ్వజమెత్తారు. సమస్యలపై విద్యార్థులు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడం దారుణమని, విద్యార్థుల మరణాలపై ఎందుకు స్పందించడం లేదని ఆయన నిలదీశారు.

# పెళ్లింట తీరని విషాదం

**రెండ్రోజుల్లో కొడుకు పెళ్లి.. అంతలోనే అనంతలోకాలకు తండ్రి**

**కామారెడ్డి, ఏప్రిల్ 11 (మనసులో మాట):** కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం శెట్పల్లి గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మరో రెండ్రోజుల్లో కొడుకు పెళ్లి ఉండనగా, తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఆ కుటుంబాన్ని శోకసముద్రంలో ముంచెత్తింది. పెళ్లి సరుకుల కోసం దుర్గయ్య బైక్‌పై వెళ్తుండగా అయ్యపల్లి గ్రామం వద్ద వేగంగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. వేడుక జరగాల్సిన ఇంట్లో తండ్రి శవమై పడి ఉండటంతో శెట్పల్లి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు ఇంటర్ ఫలితాల విడుదల

**అధికారికంగా ప్రకటించిన ఇంటర్మీడియట్ బోర్డు**

**ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఫలితాల వెల్లడి**

**హైదరాబాద్, ఏప్రిల్ 11 (మనసులో మాట):** తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఆదివారం విడుదల చేయనున్నట్లు బోర్డు అధికారికంగా ప్రకటించింది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరగగా.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 9.5 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వెబ్‌సైట్‌లలో తమ రోల్ నంబర్ ఎంటర్ చేయడం ద్వారా విద్యార్థులు ఫలితాలను పొందవచ్చు. మరోవైపు, విద్యార్థులు తమ ఫలితాలను నేరుగా వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. స్మార్ట్ ఫోన్‌లలో 80969 58096 నంబర్‌ను సేవ్ చేసుకుని 'హాయ్' అని టైప్ చేయడం ద్వారా ఫలితాలను సులభంగా తెలుసుకోవచ్చు.

# కొత్తతరం నాయకత్వం రావాలి

**ఇబ్రహీంపట్నం కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 11 (మనసులో మాట):** రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలనను అంతమొందించాలంటే కొత్తతరం నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అవి కేసీఆర్ ఎన్నికలుగానే ఉంటాయని.. అసెంబ్లీ ఎన్నికలు కాదని తేల్చిచెప్పారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన.. కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎవరిని అడిగినా ప్రభుత్వ తీరుపై అసంతృప్తిగా ఉన్నారని.. రైతన్నల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. జగిత్యాల పర్యటనలో ఒక రైతు తన ఆవేదన వ్యక్తం చేశారని.. మూడు సార్లు రైతు బంధు ఎగ్గొట్టి 27 వేల కోట్లు మిగిల్చుకుని.. అందులో నుంచి 20 వేల కోట్లు ఇచ్చి రుణమాఫీ చేశానని రేవంత్ డబ్బా కొట్టుకుంటున్నారని విమర్శించారు. రైతుల పైసలు వాళ్లకే ఇచ్చి మళ్లీ బాకీ పడ్డారని.. రుణమాఫీ కూడా ఊరిలో కొద్దిమందికే అయిందని ఎద్దేవా చేశారు.

**అన్ని వర్గాలకు మోసం**

యువతకు రెండు లక్షల ఉద్యోగాలని ఆశ చూపి.. రెండున్నర ఏళ్లలో 11 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని కేటీఆర్ మండిపడ్డారు. మహిళలకు స్కూటీలు, తులం బంగారం, నెలకు 2500 ఇస్తామని చెప్పి గద్దెనెక్కిన తర్వాత పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేసీఆర్ హయాంలో పెన్షన్ 2 వేలు చేస్తే.. నవంబర్ లో 2 వేలు, డిసెంబర్ లో 4 వేలు ఇస్తామని ముసలి వాళ్లను కూడా మోసం చేశారన్నారు. రెండు నెలల పెన్షన్ కూడా ఎగ్గొట్టారని.. ఈ 28 నెలల పాలనలో సాధించింది ఏమైనా ఉందంటే అది ఢిల్లీకి పోవడం, రావడం తప్ప మరేమీ లేదని ఎద్దేవా చేశారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే గురించి చెబుతూ.. ఆయన వసూళ్ల పర్వం అరటి పండ్ల బండ్ల వరకు వెళ్లిందని విమర్శించారు. మంచి నాయకుడు కిషన్ రెడ్డిని కోల్పోవడం వల్ల ఇబ్రహీంపట్నం ప్రజలకే నష్టం జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు.

**ఫార్మా సిటీ భవితవ్యం**

కేసీఆర్ నాయకత్వంలో 14 వేల ఎకరాలు సేకరించి ప్రపంచ స్థాయి ప్రమాణాలతో గ్రీన్ ఫార్మా సిటీ పెట్టాలని పట్టుబట్టామని గుర్తు చేశారు. కాలుష్యం లేకుండా స్థానికంగా అభివృద్ధి జరగాలనే ఉద్దేశంతో కిషన్ రెడ్డి, సబితక్కలతో కలిసి ఏడేళ్లు శ్రమించి రైతులను ఒప్పించామని తెలిపారు. 14 వేల ఎకరాల భూమిని సేకరిస్తే ప్రస్తుతం పరిస్థితి దారుణంగా మారిందని.. అక్కడ ఏం జరుగుతుందో అందరూ చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు ప్రజలకు బాగా తెలుసని కేటీఆర్ అన్నారు.



# 20న మోతెలో కేసీఆర్ భారీ సభ

**ఏర్పాట్లను పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు**


**జగిత్యాల, ఏప్రిల్ 11 (మనసులో మాట):** జగిత్యాల జిల్లా మోతెలో ఈ నెల 20వ తేదీన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సభాస్థలిని పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి పరిశీలించారు. వీరితో పాటు మాజీ జడ్పీ ఛైర్మన్ దావ వసంత, తుల ఉమ ఏర్పాట్లను పర్యవేక్షించారు. లక్ష మందికి పైగా జనం వచ్చే అవకాశం ఉండటంతో దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు విద్యాసాగర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ప్రజాభిష్టం మేరకే జీవన్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరారని వెల్లడించారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అస్తవ్యస్తమైందని.. తిరిగి కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని విమర్శించారు. జీవన్ రెడ్డి ఎప్పుడూ అధికారం కోసం ప్రాకులాడలేదని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు.

# ఈసారి వర్షాలు తక్కువే!

**ఎల్ నినో ప్రభావంతో తగ్గనున్న వర్షపాతం**

**అప్రమత్తంగా ఉండాలన్న వాతావరణ కేంద్రం**

**హైదరాబాద్, ఏప్రిల్ 11 (మనసులో మాట):** రాష్ట్రంలో ఇప్పటికే ఎండలు తీవ్రంగా ఉన్నాయి. అయితే ఈ ఏడాది వర్షాలు సాధారణం కంటే తక్కువగా కురిసే అవకాశం ఉందని వాతావరణ సంస్థ ప్రకటించింది. బలమైన ఎల్ నినో ప్రభావం, పాజిటివ్ ఇండియన్ ఓషన్ డైపోల్ పరిస్థితుల కారణంగా వర్షపాతం తగ్గుతుందని తెలంగాణ వెదర్ మ్యాన్ ట్వీట్ చేశారు. 2026 వర్షపాత అంచనాలు రైతుల్లో కొంత ఆందోళన కలిగిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో మంచి వర్షాలు కురిశాయి. ముఖ్యంగా 2025లో అధిక వర్షపాతం నమోదై సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. కానీ 2026లో పరిస్థితులు మారనున్నాయి. 2018 తరహాలో జూన్ నుండి సెప్టెంబర్ వరకు అన్ని నెలల్లో సగటు కంటే తక్కువ వర్షం కురవవచ్చు. ఈ ప్రభావం దక్షిణ తెలంగాణ జిల్లాలైన మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల ప్రాంతాలపై అధికంగా ఉండనుంది.



**తక్కువ నీటి పంటలే మేలు**

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. నీటి వనరులను పొదుపుగా వాడుకోవాలి. వరి వంటి పంటల కంటే పప్పులు, జొన్న వంటి తక్కువ నీటితో పండే పంటలను ఎంచుకోవాలి. వర్షపాతాన్ని దృష్టిలో ఉంచుకుని సాగు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వం హెచ్చరించింది. 2014-15 తరహాలో తీవ్ర పరిస్థితులు ఉండకపోయినా.. అప్రమత్తత అవసరమని స్పష్టం చేసింది.

# అమీన్‌పూర్‌లో హైడ్రా ఆపరేషన్

- కోర్టు ఉత్తర్వులు బేఖాతరు చేసిన భారీ కట్టడాల కూల్చివేత

**సంగారెడ్డి, ఏప్రిల్ 11 (మనసులో మాట):** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలను కూల్చివేస్తోంది. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి ఈ భారీ ఆపరేషన్‌ను నిర్వహిస్తోంది. కోర్టు స్టే ఆర్డర్ ఉన్నా నిర్మాణాలు జరిపిన ఓ గెస్ట్ హౌస్‌తో పాటు ఆరు అంతస్తుల భవనాన్ని హైడ్రా కూల్చివేస్తోంది. ఐలాపురం తండాతో పాటు గ్రామంలోని పేదల ఇళ్ల జోలికి వెళ్లకుండా ఖాళీ స్థలాలను హైడ్రా స్వాధీనం చేసుకుంటోంది. అమీన్‌పూర్ మండలం ఐలాపురం గ్రామంలో మొత్తం 1263 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఇప్పటికే చాలా నివాసాలు వెలిశాయి. ఆ నివాసాల జోలికి వెళ్లకుండా మిగిలి ఉన్న 860 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించేందుకు చర్యలు చేపట్టింది.

### పేదల ఇళ్ల జోలికి వెళ్లకుండా చర్యలు

ఈ 860 ఎకరాల భూమి విలువ సుమారు 15 వేల కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అంచనా. ఇక్కడ యథాతథ స్థితిని కొనసాగించాలని 1998 నుంచి కోర్టు ఆర్డర్లు ఉన్నా పట్టించుకోకుండా నిర్మించిన గెస్ట్ హౌస్‌ను హైడ్రా తొలగించింది. అలాగే ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన 6 అంతస్తుల భవనాన్ని తొలగిస్తోంది. ఐలాపురం తండాలో కానీ, గ్రామంలోని నివాస గృహాల జోలికి కానీ వెళ్లకుండా చర్యలు చేపట్టినట్లు హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. కేవలం అక్రమంగా నిర్మించిన భారీ కట్టడాలు, ఖాళీ స్థలాల స్వాధీనంపైనే దృష్టి సారించినట్లు తెలిపారు.

### చట్ట ఉల్లంఘనులపై కఠిన చర్యలు

1998 నుంచి స్టేటస్ కో కొనసాగించాలని కోర్టు ఆర్డర్లు ఉన్నప్పటికీ వాటిని ఖాతరు చేయకుండా ముఖీమ్ నిర్మించిన గెస్ట్ హౌస్‌ను హైడ్రా నేలమట్టం చేసింది. అతని సోదరుడు అజీమ్ ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించిన 6 అంతస్తుల భవనాన్ని కూడా అధికారులు తొలగించారు. ఐలాపూర్ గ్రామంలో మిగిలి ఉన్న 860 ఎకరాల ఖాళీ ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా హైడ్రా ఈ ఆపరేషన్ చేపట్టింది. కూల్చివేతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసులను మోహరించారు. హైడ్రా చేపట్టిన ఈ భారీ ఆపరేషన్ వల్ల వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడగలిగారు.

# జీవన్ రెడ్డి నిర్ణయం పెద్ద తప్పు

**బీఆర్ఎస్‌లోకి వెళ్లడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు**

**తెలంగాణను అప్పుల పాలు చేసిన కేసీఆర్**



**ములుగు, ఏప్రిల్ 11 (మనసులో మాట):** కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి వెళ్లి మాజీ మంత్రి జీవన్ రెడ్డి పెద్ద తప్పు చేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఇన్నేళ్లు బీఆర్ఎస్ అవినీతిపై గళమెత్తిన ఆయన, నేడు అదే పార్టీతో చేతులు కలపడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ముక్కలైందని, ఆ పార్టీ నేతలు ఆస్తుల కోసం కొట్టుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణలో బీజేపీకి ఆదరణ లేదని ఆయన స్పష్టం చేశారు.

### కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ

శనివారం ములుగు జిల్లాలో పర్యటించిన మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్‌లోకి వెళ్లిన వారి గతి ఏమైందో అందరూ చూశారని, అక్కడ కేవలం కుటుంబానికే ప్రాధాన్యత ఉంటుందని ఎద్దేవా చేశారు. ప్రజల్లో కాంగ్రెస్ పట్ల రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని, ఇప్పుడు ఎన్నికలు జరిగినా తమ పార్టీ 100 స్థానాల్లో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దశ, దిశ లేకుండా పదేళ్లు పాలన సాగించిన కేసీఆర్, రాష్ట్రాన్ని రూ. 8 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని హామీ ఇచ్చారు. కాంట్రాక్టర్లు ఇచ్చే డబ్బులతో జేబులు నింపుకోవడం వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని ఆయన విమర్శలు చేశారు.

# వాటర్ బిల్లు మెసేజ్‌లతో జాగ్రత్త!

**లింకులు ఓపెన్ చేస్తే అకౌంట్ ఖాళీ**

**అప్రమత్తంగా ఉండాలన్న సీపీ సజ్జనార్**

**హైదరాబాద్, ఏప్రిల్ 11 (మనసులో మాట):** హైదరాబాద్ నగరంలో సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయని హైదరాబాద్ కమిషనర్ సీపీ సజ్జనార్ తెలిపారు. వాటర్ బోర్డు బిల్లుల పేరిట ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ.. వారి వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను దోచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ మోసాలు ముఖ్యంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు పేరిట జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు సీపీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా ఒక హెచ్చరిక చేశారు. నీటి కనెక్షన్ కట్ చేస్తామంటూ వచ్చే ఫోన్ కాల్స్ లేదా మెసేజ్‌లతో భయపడవద్దని కోరారు. సైబర్ కిలేడీలు పన్నే వలలో చిక్కుకోవద్దని సూచించారు.

### నకిలీ ఏపీకే యాప్‌లతో ప్రమాదం

సైబర్ నేరగాళ్లు ముందుగా వినియోగదారులకు ఫోన్ చేసి, వాటర్ బిల్లు బకాయి ఉందని, వెంటనే చెల్లించకపోతే కనెక్షన్ కట్ చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని పోలీసులు తెలిపారు. ఆ తర్వాత ఒక అనుమానాస్పద లింకును పంపి, దానిని డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేయాలని సూచిస్తున్నట్లు చెప్పారు. ఇది అసలు అధికారిక యాప్ కాదని, మాల్‌వేర్‌తో కూడిన ఫేక్ ఏపీకే అని పోలీసులు హెచ్చరించారు. ఈ ఏపీకే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసిన వెంటనే మొబైల్ ఫోన్ పై పూర్తి నియంత్రణ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. ఫోన్ నియంత్రణలోకి వెళ్లడం ద్వారా నేరగాళ్లు ఫోన్ కాల్స్‌ను డైవర్ట్ చేయగలరని, మెసేజ్‌లు, ఓటీపీలను చదవగలరని పోలీసులు వివరించారు. యూజర్ తెలియకుండానే ట్రాన్సాక్షన్లు చేస్తూ క్షణాల్లో బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపే ఎలాంటి ఏపీకే ఫైళ్లను ఇన్‌స్టాల్ చేయకూడదని స్పష్టం చేశారు. ప్రజలు తమ నీటి బిల్లులను కేవలం అధికారిక వెబ్‌సైట్ లేదా అధికారిక మొబైల్ యాప్‌ల ద్వారానే చెల్లించాలని సూచించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్ వస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

# మహిళా బిల్లుతో నవశకం

**33 శాతం రిజర్వేషన్లతో మహిళా శక్తికి పట్టం: డీకే అరుణ**



**హైదరాబాద్, ఏప్రిల్ 11 (మనసులో మాట):** పార్లమెంటులో నారీ శక్తి వందనం బిల్లును ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 16న ప్రవేశపెట్టనున్నారని బీజేపీ ఎంపీ డీకే అరుణ వెల్లడించారు. ఎన్నో ఏళ్లుగా మహిళలు ఎదురుచూస్తున్న 33 శాతం రాజకీయ రిజర్వేషన్ల కల ఈ బిల్లుతో నెరవేరబోతోందని పేర్కొన్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ సహా అనేక పార్టీలు ఈ బిల్లును అడ్డుకున్నా మోదీ హయాంలోనే ఇది సుసాధ్యం కాబోతోందని అన్నారు. ఈ నెల 16 నుంచి 18 వరకు జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో దీనిపై చర్చ జరగనుందని తెలిపారు.

### చట్టసభల్లో పెరగనున్న ప్రాతినిధ్యం

రాజకీయాల్లో మహిళలు పెరిగితే అభివృద్ధి వేగవంతం అవుతుందని అరుణ అభిప్రాయపడ్డారు. 2029 ఎన్నికల నాటికి ఈ రిజర్వేషన్లు అమలయ్యేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోందని వివరించారు. డీ లిమిటేషన్ ప్రక్రియ పూర్తయితే తెలంగాణ నుంచి 60 మంది మహిళలు అసెంబ్లీలో, 9 మంది పార్లమెంటులో అడుగుపెట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ మహిళలకు కూడా దీనివల్ల గొప్ప అవకాశాలు దక్కుతాయన్నారు. పార్టీలకతీతంగా అందరూ ఈ బిల్లుకు మద్దతు తెలపాలని కోరారు. ఈ చట్టం మూడు టర్మ్ ల వరకు అమల్లో ఉంటుందని వెల్లడించారు.

# గజ్వేల్ రింగ్ రోడ్డు పనులు పూర్తి చేయండి

**పెండింగ్ పనులను పరిశీలించిన ఎంపీ రఘునందన్ రావు**

**సిద్దిపేట, ఏప్రిల్ 11 :** గజ్వేల్ అభివృద్ధికి రింగ్ రోడ్డు ఎంతో కీలకమని, నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తి చేసేలా సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు కోరారు. శనివారం గజ్వేల్ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న రింగ్ రోడ్డును ఆయన స్వయంగా పరిశీలించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల నర్సెట్టకు వచ్చినప్పుడు ఈ రింగ్ రోడ్డు వ్యవహారం గురించి వివరించగా.. సమస్యను పరిష్కరిస్తామని సభ వేదికగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

### భూ సేకరణలో అధికారుల నిర్లక్ష్యం

రింగ్ రోడ్డు పూర్తి కావడానికి 151 మీటర్ల భూ సేకరణ పెండింగ్‌లో ఉందని రఘునందన్ రావు వెల్లడించారు. ఒక రైతును పిలిచి ఒప్పించడంలో జిల్లా రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సమస్య ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి తానే స్వయంగా వచ్చి పరిశీలించానని.. జిల్లా ఎంపీగా భూమి ఇచ్చే రైతుతో మాట్లాడి ఈ పనులపై చొరవ తీసుకుంటానని తెలిపారు. రైతు అంగీకరించని పక్షంలో చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని ఎంపీ పేర్కొన్నారు.

# వర్ణ వివక్షపై పోరాటం ఆదర్శనీయం

## సామాజిక విప్లవకారుడు పూలేకు కేసీఆర్ నివాళి

**హైదరాబాద్, ఏప్రిల్ 11 (మనసులో మాట):** వర్ణ వివక్షకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన సామాజిక విప్లవకారుడు, సమ సమాజ స్థాపన మార్గదర్శి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన సేవలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. భారత సమాజంలో వర్ణ, కుల, లింగ వివక్షను రూపుమాపి సామాజిక న్యాయం అందించిన దార్శనికుడు పూలే అని కొనియాడారు. సబ్బండ వర్ణాలు సామాజిక, ఆర్థిక రంగాల్లో ఎదగాలంటే విద్య ఒక్కటే మార్గమని పూలే చెప్పిన మాటలు ఎల్లప్పుడూ ఆచరణీయమని తెలిపారు. తన భార్య సావిత్రి బాయి పూలేకు చదువు నేర్పించి, మహిళా విద్య కోసం అనేక కష్టాలను ఎదుర్కొన్న గొప్ప సంకల్పం ఆయనదని ప్రశంసించారు. పూలే ఆశయాలకు అనుగుణంగానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో సబ్బండ కులాల అభ్యున్నతికి కృషి చేసిందని కేసీఆర్ గుర్తు చేశారు. సాగునీరు, విద్యుత్, రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలతో వ్యవసాయ రంగాన్ని పటిష్టం చేశామన్నారు. గొర్రెల పెంపకం, చేపల పంపిణీ, నేతన్నకు చేయూత వంటి వృత్తి కులాల ప్రోత్సాహక పథకాలతో దళిత బహుజనులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారని తెలిపారు. దీనివల్ల తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునరుజ్జీవం లభించిందని చెప్పారు. ఆసరా పెన్షన్లు, బీసీ బంధు వంటి పథకాలతో వెనుకబడిన కులాల అభివృద్ధికి బాటలు వేశామని పేర్కొన్నారు. బీసీ కులాల విద్య కోసం ప్రత్యేక రెసిడెన్షియల్ విద్యాసంస్థలు ఏర్పాటు చేసి అంతర్జాతీయ స్థాయి చదువును అందించామని కేసీఆర్ వివరించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో బీసీ కులాల ఆత్మగౌరవం నిలబడేలా అత్యంత విలువైన స్థలాలు, నిధులు కేటాయించి ఆత్మగౌరవ భవనాల నిర్మాణం చేపట్టామన్నారు. పూలే ఆశయాల మేరకు తాము ప్రారంభించిన ప్రగతి పథకాలను ప్రస్తుత ప్రభుత్వం కూడా చిత్తశుద్ధితో కొనసాగించాలని సూచించారు. అప్పుడే మహాత్మా పూలేకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని కేసీఆర్ స్పష్టం చేశారు.

# అంబులెన్స్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు

## రోడ్డు ప్రమాదంలో రోగి, డ్రైవర్ దుర్మరణం

**కామారెడ్డి, ఏప్రిల్ 11 (మనసులో మాట):** కామారెడ్డి జిల్లా భిక్నూర్ మండలం రామేశ్వర్‌పల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న అంబులెన్స్‌ను వేగంగా దూసుకొచ్చిన ప్రైవేటు బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న రోగి సలేహా భాను (63), డ్రైవర్ షేక్ సర్దార్ (35) ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఆమె భర్త సైఫుల్లా ఖాన్ (76) తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని గాయపడిన వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. సలేహా భాను ఆరోగ్యం క్షీణించడంతో ఆమెను హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రి నుంచి ఆదిలాబాద్‌లోని స్వగ్రామానికి తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రైవేట్ బస్సు అతివేగంగా వచ్చి ఢీకొనడంతో అంబులెన్స్ తీవ్రంగా దెబ్బతిన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# దక్షిణాది గొంతు నొక్కే కుట్ర!

- ఉత్తరాదిలో ఎంపీ సీట్లు పెంచేందుకు కేంద్రం ప్లాన్
- పన్నులు మనవి.. నిధులు వాళ్లకా?: భట్టి విక్రమార్క



**హైదరాబాద్, ఏప్రిల్ 11 (మనసులో మాట):** దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం చూపుతున్న వివక్షను ప్రతి ఒక్కరూ గమనించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మన దగ్గర పన్నులు వసూలు చేస్తూ ఉత్తరాదికి నిధులు ధారపోస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు డిలిమిటేషన్ పేరుతో ఉత్తరాదిలో ఎంపీ స్థానాలను పెంచి దక్షిణాది ప్రాధాన్యతను తగ్గించే కుట్ర జరుగుతోందన్నారు. దక్షిణాది గొంతు నొక్కాలని చూస్తున్న ఈ రాజకీయ కుట్రలను బహుజనులు, ప్రజాస్వామ్యవాదులు ఏకమై తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సామాజిక మార్పు కోసం అందరూ కలిసి రావాలన్నారు.

### దేశానికే ఆదర్శంగా కులగణన

మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న భట్టి విక్రమార్క.. దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో కులగణన చేపట్టి ఆదర్శంగా నిలిచామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అందించాలనే పట్టుదలతో ఢిల్లీ వేదికగా ధర్నా కూడా చేశామని చెప్పారు. కానీ కేంద్ర ప్రభుత్వం మన చట్టాన్ని ఆమోదించకుండా కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణ గడ్డపై సామాజిక న్యాయమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సీఎం రేవంత్ నాయకత్వంలో సామాజిక స్పృహతో కూడిన పాలనను అందిస్తున్నామని తెలిపారు.

### సామాజిక న్యాయమే ఊపిరి

మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను ఊపిరిగా తీసుకుని కుల వివక్ష లేని సమాజం కోసం అడుగులు వేస్తున్నామని భట్టి పేర్కొన్నారు. ఆనాడు పూలే లాంటి మహనీయులే వివక్షకు గురైనా భవిష్యత్తు తరాల కోసం వారు వేసిన పునాదులే మార్గదర్శకాలన్నారు. సమాజంలో మార్పు రావాలంటే పూలే ఆలోచన విధానాన్ని ప్రతి ఒక్కరూ పుణికిపుచ్చుకోవాలని సూచించారు. పూలే ఆశయాల సాధనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

## హిమాయత్ సాగర్ సర్వీస్ రోడ్డుపై అదుపుతప్పిన బైక్

## మృతులు పాతబస్తీకి చెందిన ఎలక్ట్రీషియన్లు




**హైదరాబాద్, ఏప్రిల్ 11 (మనసులో మాట):** హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోవడంతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని హిమాయత్ సాగర్ సర్వీస్ రోడ్డుపై ఈ ప్రమాదం జరిగింది.

### అదుపుతప్పిన వేగం

అతివేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను పాతబస్తీకి చెందిన అబ్దుల్ సోహైల్ (20), షేక్ సాహిల్ (17)గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్లుగా పనిచేస్తున్నారు. పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే రాజేంద్రనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# హైవేలపై డీజిల్ దొంగల ముఠా అరెస్ట్

## ఆరుగురు సభ్యుల అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

## వెయ్యి లీటర్ల డీజిల్, వాహనాలు స్వాధీనం

**నల్గొండ, ఏప్రిల్ 11 (మనసులో మాట):** రహదారి పక్కన నిలిపి ఉంచిన వాహనాల నుండి డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆరుగురు సభ్యులు ఉన్న ఈ ముఠాను నల్గొండ పోలీసులు పట్టుకోగా.. నిందితుల్లో ఒక మైనర్ కూడా ఉన్నాడు. వీరి నుండి వెయ్యి లీటర్ల డీజిల్ తో పాటు రెండు డీసీఎం వాహనాలు, ఆరు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై తెలుగు రాష్ట్రాల్లో 20కి పైగా కేసులు ఉన్నట్లు జిల్లా అదనపు పోలీసు అధికారి రమేష్ వెల్లడించారు.

### అర్ధరాత్రి వేళ ఆగడాలు

హైవేలపై ఆగి ఉన్న వాహనాలే లక్ష్యంగా అర్ధరాత్రి వేళ ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అదనపు పోలీసు అధికారి వివరాలను వెల్లడించారు. చాలా కాలంగా ప్రధాన రహదారుల పక్కన నిలిపి ఉంచిన లారీలు, ఇతర భారీ వాహనాల ట్యాంకుల నుండి డీజిల్ దొంగిలిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ క్రమంలో నిఘా పెంచిన పోలీసులు ఆరుగురు సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకున్నారు.

### డ్రైవర్లు నిద్రిస్తున్న సమయంలోనే..

నిందితుల వద్ద నుండి సుమారు రూ. 40 లక్షల విలువైన ఆస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యులు అర్ధరాత్రి సమయంలో హైవేల వెంట ఆగి ఉన్న వాహనాలను గమనించి, డ్రైవర్లు నిద్రపోతున్న తరుణంలో అత్యంత వేగంగా డీజిల్ ట్యాంకుల సీల్ తొలగించేవారు. పైపుల ద్వారా డీజిల్‌ను తమ వాహనాల్లోకి మళ్లించేవారు. హైవేలపై వాహనాలు నిలిపే డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే వంద నంబరుకు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

# అక్షరాస్యతలో వెనుకబడిన తెలంగాణ

- విద్యా రంగం పూర్తిగా అస్తవ్యస్తం:
- పూలే ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, ఏప్రిల్ 11 :** ప్రముఖ సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘన నివాళులర్పించారు. అణచివేతపై తిరుగుబాటుకు పూలే కేరాఫ్ అడ్రస్ అని, బడుగు బలహీన వర్గాలకు ఆయన కొండంత ధైర్యమని కొనియాడారు. కుల వివక్షపై అలుపెరగని పోరాటం చేస్తూనే వితంతు పునర్వివాహాలు, స్త్రీ విద్య కోసం పూలే నిరంతరం పాటుపడ్డారని ఓ ప్రకటనలో ప్రశంసించారు.



### కాంగ్రెస్ పాలనపై నిప్పులు

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూలే ఆశయాలకు భిన్నంగా పాలన సాగిస్తోందని బండి సంజయ్ విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యాశాఖ పనితీరు దారుణంగా ఉందన్నారు. అక్షరాస్యతలో జాతీయ సగటు కంటే తెలంగాణ వెనుకబడి ఉండటం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ బకాయిలు చెల్లించకపోవడంతో పేదలు విద్య, వైద్యానికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను అమ్ముతూ భవిష్యత్ తరాలకు చోటు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు.

### అణగారిన వర్గాల వెలుగు

దీనబంధు పత్రిక ద్వారా పేదల సమస్యలను చాటిన మహోన్నతుడు పూలే అని బండి సంజయ్ పేర్కొన్నారు. బీఆర్ అంబేద్కర్ సైతం పూలేను తన గురువుగా ప్రకటించుకున్నారని గుర్తు చేశారు. సావిత్రీబాయి పూలేతో కలిసి 52 పాఠశాలలను స్థాపించి విద్యా విప్లవానికి నాంది పలికారని తెలిపారు. స్వాతంత్ర్యానికి పూర్వమే అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఇకనైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూలే ఆశయాలను మాటల్లో కాకుండా చేతల్లో చూపాలని డిమాండ్ చేశారు.

# పారదర్శకంగా మేడారం పనులు

- అవాస్తవాలు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు
- అంగన్‌వాడీ ఫోన్ల కొనుగోలుపై విపక్షాలకు సీతక్క సవాల్

**ములుగు, ఏప్రిల్ 11 (మనసులో మాట):** మేడారం సమ్మక్క-సారలమ్మ అమ్మవార్ల గద్దెల పునర్నిర్మాణ పనుల్లో ఎక్కడా అవినీతి జరగలేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గద్దెల పనుల్లో అవినీతి జరిగిందంటున్న విపక్షాలు.. దమ్ముంటే ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. అవసరమైతే ఈ పనులపై సీబీఐ విచారణ జరపాలని సూచించారు. శనివారం ములుగులో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పర్యటించగా.. గట్టమ్మ దేవాలయం వద్ద మంత్రి, కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన కార్యకర్తల



సమావేశంలో మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ అధికారాన్ని తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో తనను ఓడించేందుకు వందల కోట్లు ఖర్చు చేసి, తనపై తప్పుడు ప్రచారం చేశారని మంత్రి మండిపడ్డారు. అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చే ఫోన్లలో అవినీతి జరిగిందని విమర్శించడం సరికాదని హితవు పలికారు. రూ. 11,650లకే ఫోన్లు కొనుగోలు చేస్తే.. రూ. 14,000 అని అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంగన్‌వాడీలకు ఫోన్ల కొనుగోలు ప్రక్రియ కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఐదుగురు నిపుణుల కమిటీ పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా జరిగిందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉండేదని సీతక్క ఎద్దేవా చేశారు. కరెంటు, తాగునీరు వంటి కనీస మౌలిక వసతులు కూడా కల్పించలేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 12,500 అంగన్‌వాడీలకు సొంత భవనాలే లేకపోయినా గత పాలకులు పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మార్పు మొదలైందని, ఇప్పటికే రెండు వేల కొత్త భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. అంగన్‌వాడీలను సకల సౌకర్యాలతో ప్రీ-ప్రైమరీ స్కూళ్లుగా తీర్చిదిద్దుతుంటే ఓర్వలేక కొన్ని పార్టీలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. విమర్శలు పక్కన పెట్టి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

# లారీని ఢీకొన్న ప్రైవేట్ బస్సు

### 16 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు

**సూర్యాపేట, ఏప్రిల్ 11 (మనసులో మాట):** సూర్యాపేట జిల్లా కోదాడ బైపాస్ వద్ద జాతీయ రహదారిపై లారీని ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 16 మంది ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రైవేట్ బస్సు హైదరాబాద్ నుండి ఏలూరు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 36 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని బస్సులో ఉన్న ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. వేగంగా వెళ్తున్న బస్సు ఒక్కసారిగా ముందున్న లారీని ఢీకొనడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# కమిషనర్ వేధింపులు.. డిప్యూటీ రాజీనామా!

### ఆత్మాభిమానం చంపుకుని పని చేయలేనన్న సోమిరెడ్డి

### ముప్పై ఏళ్ల సర్వీసును వదులుకుని మనస్తాపంతో నిర్ణయం

**నిజామాబాద్, ఏప్రిల్ 11 (మనసులో మాట):** జిల్లా ఎక్సైజ్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ మధ్య వివాదం తీవ్ర కలకలం రేపుతోంది. ఎక్సైజ్ కమిషనర్ తనను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని దూషిస్తున్నారని డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆరోపించారు. తన ముప్పై ఏళ్ల సుదీర్ఘ సర్వీసును వదులుకుంటూ ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటించారు. కమిషనర్ మాటలతో మనస్తాపం చెంది తాను ఆస్పత్రి పాలైనట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారి వేధింపులు భరించలేకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సోమిరెడ్డి స్పష్టం చేశారు.

### ఆత్మాభిమానం కోసం పదవి త్యాగం

బదిలీల ప్రక్రియలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోరినందుకు కమిషనర్ తనపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సోమిరెడ్డి వెల్లడించారు. కింది స్థాయి ఉద్యోగుల ముందు కమిషనర్ ఇష్టానుసారంగా మాట్లాడటం తనను ఎంతగానో బాధించిందని ఆయన ఆవేదన చెందారు. ఆత్మగౌరవాన్ని చంపుకుని ఉద్యోగంలో కొనసాగలేనని పేర్కొంటూ ప్రభుత్వానికి లేఖ రాశారు. సీనియర్ అధికారి ఇలా మనస్తాపంతో రాజీనామా చేయడం ఎక్సైజ్ శాఖలో పెద్ద చర్చకు దారితీసింది.

# లాయర్‌పై సింగర్ మంగ్లీ ఫిర్యాదు

### వేధింపులకు గురిచేస్తున్నారని పోలీసులకు మొర

### రూ. 150 కోట్ల మోసం చేశాననడం అబద్ధమని వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 11 (మనసులో మాట):** ప్రముఖ సింగర్ మంగ్లీ తనను సుభా సింగబోయిన అనే న్యాయవాది వేధిస్తున్నారంటూ నార్సింగి పోలీసులను ఆశ్రయించారు. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ అప్రతిష్ట పాలు చేస్తానని బెదిరిస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగ్లీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తాను రూ. 150 కోట్ల మోసానికి పాల్పడ్డానంటూ సుభా సింగబోస్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఈ ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని ఆమె స్పష్టం చేశారు. మార్చి 21న సదరు వ్యక్తి పరిచయం చేసుకున్నప్పటి నుండి అమర్యాదగా, బెదిరించే ధోరణిలో మాట్లాడుతున్నారని వివరించారు. తనను కలవాలని సదరు వ్యక్తి తీవ్ర ఒత్తిడి చేశారని, అందుకు నిరాకరించడంతో సామాజిక మాధ్యమాల్లో అప్రతిష్ట పాలు చేస్తానని బెదిరించినట్లు మంగ్లీ ఆరోపించారు. తనకు ఎలాంటి సంబంధం లేని కరెన్సీ నోట్లు ఉన్న వీడియోలను చూపించి, మరో వ్యక్తితో కలిసి తనపై అవమానకర వ్యాఖ్యలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పరిణామాల వల్ల తన కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, తన వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగ్లీ ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన నార్సింగి పోలీసులు, నిందితుడు సుభా సింగబోస్ పై కేసు నమోదు చేశారు.

# గాయని మంగ్లీపై కేసు

**పెట్టుబడుల పేరిట భారీ మోసం.. పంజాగుట్టలో ఫిర్యాదు**

**యాక్సిడెంట్ చేసి చంపేస్తామంటూ న్యాయవాదికి హెచ్చరికలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 11 (మనసులో మాట):** తెలుగు రాష్ట్రాల్లో జానపద గీతాలతో గుర్తింపు పొందిన గాయని మంగ్లీ వివాదంలో చిక్కుకున్నారు. పెట్టుబడుల పేరిట నగదు సేకరించి మోసం చేయడం, న్యాయవాదిని బెదిరించడం వంటి ఆరోపణలతో ఆమెపై కేసు నమోదైంది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో నమోదైన ఫిర్యాదు ప్రకారం మంగ్లీ, ఆమె సోదరుడు శివ, మరికొందరు కలిసి 100 మంది నుంచి భారీగా నిధులు సేకరించారు. వ్యాపారంలో అధిక లాభాలు ఇస్తామని నమ్మించి ఈ వసూళ్లకు పాల్పడ్డారు. కాలం గడుస్తున్నా లాభాలు ఇవ్వకపోగా, అసలు కూడా తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు ఆందోళన చెందారు. న్యాయం కోసం వారు న్యాయవాది సుబ్బారావును ఆశ్రయించగా, ఆయన జోక్యం చేసుకోవడంతో ఈ వివాదం ముదిరింది.



**హత్య బెదిరింపులు**

డబ్బులు తిరిగి ఇవ్వాలని నిలదీయడంతో మంగ్లీ బృందం నుంచి బెదిరింపులు వచ్చాయని సుబ్బారావు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో దర్శకుడు వేణు ఊడుగుల పేరు వెలుగులోకి వచ్చింది. మంగ్లీ, శివ, వేణు ఊడుగుల కలిసి ఫోన్ లో తనను తీవ్రంగా బెదిరించారని, యాక్సిడెంట్ చేయించి చంపేస్తామని హెచ్చరించారని న్యాయవాది ఆరోపించారు. తనకు ప్రాణహాని ఉందని పోలీసులను రక్షణ కోరారు. ఫిర్యాదుపై విచారణ జరిపిన పోలీసులు మంగ్లీ, శివ, వేణు ఊడుగులతో పాటు ఇతరులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హిట్ పాటలతో దూసుకుపోతున్న మంగ్లీపై ఇలాంటి ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. దర్యాప్తులో నిజానిజాలు తేలాల్సి ఉంది. తన పాటలతో గుర్తింపు తెచ్చుకున్న మంగ్లీ వివాదాలతో ఇమేజ్ దెబ్బతీసుకుంటున్నారు.

# మోతె సభతో బీఆర్ఎస్ సత్తా చాటుతాం

**మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**

**జగిత్యాల, ఏప్రిల్ 11 (మనసులో మాట):** మోతె సభతో బీఆర్ఎస్ తన సత్తా చాటుతుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కనువిప్పు కలిగిస్తామని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జగిత్యాల జిల్లా మోతెలో సభాస్థలిని సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. ఈ బహిరంగ సభ ద్వారా ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని తెలిపారు. ఉత్తర తెలంగాణలో జీవన్ రెడ్డి చేరికతో పార్టీకి మరింత బలం చేకూరిందని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా మోతెలో ఈ నెల ఇరవైవ తేదీన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాల్గొనే భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ మేరకు సభ ఏర్పాట్ల కోసం పరిశీలించారు.

# మెరుగైన రోడ్లు.. భవిష్యత్ తరాలకు బాటలు

- పెద్ద అంబర్‌పేటలో రూ. 13 కోట్లతో రోడ్ల నిర్మాణానికి శ్రీకారం
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**రంగారెడ్డి జిల్లా, ఏప్రిల్ 11 (మనసులో మాట):** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఆర్ అండ్ బీ శాఖ నుండి రూ. 13 కోట్ల భారీ నిధులతో పెద్ద అంబర్‌పేటలో నూతన రోడ్ల నిర్మాణ పనులకు ఆయన రోడ్లు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. నియోజకవర్గాన్ని ఆధునిక మౌలిక వసతులతో అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు.

**ప్రగతి పథంలో నియోజకవర్గం**



ఎమ్మెల్యేగా మల్ రెడ్డి రంగారెడ్డి గెలిచిన తర్వాత నియోజకవర్గంలోని చాలా గ్రామాలకు, కాలనీలకు రోడ్లు, అండర్ డ్రైనేజీ వ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని నేతలు పేర్కొన్నారు. గత 15 ఏళ్లలో నియోజకవర్గ ప్రగతి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉండేదని విమర్శించారు. ప్రస్తుతం ప్రతి గ్రామం, పట్టణం ప్రగతి బాటలో పయనిస్తున్నాయని ఈ సందర్భంగా వారు వెల్లడించారు.

# 13 నుండి 18 వరకు 'అరైవ్-అలైవ్'

**రోడ్డు భద్రతపై ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు**

**అన్ని శాఖల సమన్వయంతో నిర్వహించాలని డీజీపీ ఆదేశం**

**హైదరాబాద్, ఏప్రిల్ 11 (మనసులో మాట):** రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అరైవ్-అలైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వంలోని అన్ని శాఖల సమన్వయంతో వీటిని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 13వ తేదీ నుండి 18వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక రోడ్డు ప్రమాదాలు మన దేశంలోనే జరుగుతున్నాయని, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఎక్కువ సంఖ్యలో మృతి చెందుతున్నారని తెలిపారు.



ప్రజా సంక్షేమం, భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆయన చెప్పారు. గ్రామాల్లో ఉన్న ఎంపీటీసీలు, సర్పంచుల నుండి సీఎం వరకు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశించినట్లు డీజీపీ తెలిపారు. ప్రతి గ్రామంలో రోడ్డు భద్రతా కమిటీని ఎనిమిది నుండి తొమ్మిది మందితో ఏర్పాటు చేయాలని, దానిలో విరమణ పొందిన ఉద్యోగులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యతులు ఉండేలా చూడాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీజీపీ శివధర్ రెడ్డి పిలుపునిచ్చారు.

# పంట కొనుగోళ్లపై సర్కార్ నిర్లక్ష్యం

**సిద్దిపేట యార్డులో రైతుల పక్షాన హరీష్ రావు ఆందోళన**

**మద్దతు ధర కోసం అధికారులకు అల్టిమేటం**

**సిద్దిపేట, ఏప్రిల్ 11 (మనసులో మాట):** పంట కొనుగోలు చేయకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ అలసత్వంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు. శనివారం సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డును హరీష్ రావు సందర్శించారు. పొద్దుతిరుగుడు, మొక్కజొన్న ధాన్యాన్ని నాలుగు రోజుల నుంచి కొనుగోలు చేయడం లేదని రైతులు ఆయనకు విన్నవించారు. అన్నదాతల సమస్యలు విని అధికారులతో ఫోన్ లో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. పూలే జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

**కొనుగోలు కేంద్రాలు ఏవి?**

రైతుల పట్ల కాంగ్రెస్ సర్కార్ చిన్నచూపు చూస్తోందని హరీష్ రావు ధ్వజమెత్తారు. నారాయణఖేడ్, ఆదిలాబాద్, నిజామాబాద్ కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు సెంటర్లు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డులను అధికారులు సందర్శించాలని కోరారు. చాలా చోట్ల



సెంటర్లు ప్రారంభించకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకుంటూ రైతులు నష్టపోతున్నారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి పంట మార్పిడి చేయమని చెబుతున్నారని.. కానీ పంట మార్పిడి చేస్తే వాటిని కొనే దిక్కు లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతోందని మండిపడ్డారు. వివిధ జిల్లాల్లో వడగళ్ల వానల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. రైతులకు సమయానికి రైతు బంధు ఇవ్వాలని కోరారు. బీసీలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం దగా చేసిందని దుయ్యబట్టారు. బీసీ డిక్లరేషన్ పేరుతో వారిని మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో అన్ని కుల వృత్తులను ప్రోత్సహించామని గుర్తు చేశారు. బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ ను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# సమానత్వానికి పునాది వేసిన పూలే



- జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నివాళి
- బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు

**ఎల్బీనగర్, ఏప్రిల్ 11 (మనసులో మాట):** దేశంలో తొలితరం సామాజిక విప్లవకారుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ లోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సామాజిక సమానత్వానికి పునాది వేసిన మహానేత పూలే అని కొనియాడారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడని తెలిపారు.

మహిళల విద్య, దళితుల హక్కులు, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పూలే చూపిన మార్గం నేటికీ సమాజానికి వెలుగుదీపంలా నిలుస్తోందని.. ఆయన ఆశయాల సాధనలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, మన్సూరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు పోచబోయిన జగదీష్ యాదవ్, పూలే యువజన సంఘం సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# పూలే ఆశయ సాధనే అసలైన నివాళి

### హయత్ నగర్‌లో పూలే 199వ జయంతి వేడుకలు

### విగ్రహానికి పూలమాల వేసిన కల్లెం నవజీవన్ రెడ్డి



**ఎల్బీనగర్, ఏప్రిల్ 11 (మనసులో మాట):** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, గొప్ప సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా తాజా మాజీ కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి హయత్ నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు పూలే అని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.

### సమానత్వ సమాజమే లక్ష్యం

మహిళా విద్య, దళితుల హక్కుల కోసం పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని నవజీవన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, గంగాని శ్రీనివాస్, జిల్లా ఎస్ సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, నాయకులు పిట్టల జంగం, శక్తి సింగ్, లక్ష్మణ్, నరేష్ పాల్గొన్నారు.



# సమానత్వానికి సత్యశోధక బాట

### సరూర్‌నగర్‌లో పూలే 199వ జయంతి వేడుకలు

### విగ్రహానికి నివాళులర్పించిన బాతరాజు నర్సింహ

**సరూర్‌నగర్, ఏప్రిల్ 11 (మనసులో మాట):** భారత కమ్యూనిస్టు పార్టీ సరూర్‌నగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనకు పూలే ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

### స్త్రీ విద్యకు మార్గదర్శి

దిగువ కులాల ప్రజలకు సమాన హక్కుల కోసం 1873లో పూలే సత్యశోధక్ సమాజ్‌ను ఏర్పాటు చేశారని నర్సింహ తెలిపారు. ఆయన భార్య సావిత్రీబాయి పూలేతో కలిసి 1848లోనే తొలి బాలికల పాఠశాలను ప్రారంభించి మహిళా విద్యకు మార్గదర్శకులుగా నిలిచారని కొనియాడారు. విద్య విశ్వీకరణను సమర్థించిన తొలి సంస్కర్త ఆయనేనని, వితంతువుల కోసం ప్రత్యేక గృహాన్ని స్థాపించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నేత మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్, జిల్లాల కృష్ణ, రామావత్ సక్రు నాయక్, ఎండీ మహబూబ్, మహమ్మద్ ఇస్మాయిల్, ఉష, జాహద్, భాగ్యమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

# సామాజిక విప్లవకారుడు పూలేకు నివాళి



**రంగారెడ్డి జిల్లా, ఏప్రిల్ 11 (మనసులో మాట):** అబ్దుల్లాపూర్ మెట్టు మండలం రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్-3 పోరాట కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే కమాన్ దగ్గర వేడుకలు నిర్వహించారు. సమాజంలో కులవివక్ష, అంటరానితనంపై పోరాటం చేసిన గొప్ప సంఘసంస్కర్త పూలే 199 వ జయంతి సందర్భంగా సీపీఐ రాష్ట్ర నాయకులు అందోజు రవీంద్రా చారి, యాదిరెడ్డి హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాలకు హక్కులు, మహిళలకు విద్యావకాశం కల్పించిన మహనీయుడు పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్ మెట్టు మండల కౌన్సిల్, కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. వీరితో పాటు భూ పోరాట కమిటీ సభ్యులు కూడా హాజరై సామాజిక సమానత్వం కోసం పూలే చేసిన కృషిని స్మరించుకున్నారు.

# తెలుగు రాష్ట్రాల ఐటీడీఏల బలోపేతం

### గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో సమీక్ష

### అభివృద్ధి పనులపై కేంద్ర డైరెక్టర్ దిశానిర్దేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 11 (మనసులో మాట):** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఐటీడీఏల బలోపేత చర్యలపై కేంద్ర ప్రభుత్వం, గిరిజన మంత్రిత్వ శాఖ హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్ గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో కార్యశాల నిర్వహించింది. ఈ సమావేశానికి కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ డాక్టర్ వర్నాలి దేకా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గిరిజన సాంస్కృతిక శిక్షణ సంస్థ సంచాలకులు డాక్టర్ వి. సముజ్వల అధికారులకు స్వాగతం పలికారు. ఐటీడీఏల ప్రస్తుత పరిస్థితి, నిధుల వినియోగం, విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, మౌలిక వసతుల అభివృద్ధిపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. గిరిజన ప్రాంతాల్లో జీవనోపాధి అవకాశాలను పెంపొందించడానికి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, యువతకు శిక్షణ, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు నిర్వహించాల్సిన అవసరాన్ని గుర్తించారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ద్వారా యువతకు శిక్షణ అందించడంపై చర్చించారు. గిరిజన హక్కుల పరిరక్షణ, అటవీ హక్కుల చట్టం అమలు, భూమి సమస్యల పరిష్కారం, వలసల నియంత్రణ వంటి అంశాలపై కూడా సమగ్ర చర్చ జరిగింది. గ్రామ స్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని నిర్ణయించారు. గిరిజన విద్యా అభివృద్ధిలో భాగంగా స్థానిక భాషల్లో ప్రాథమిక విద్య, కెరీర్ గైడెన్స్, ఆశ్రమ పాఠశాలల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో వంద శాతం పదవ తరగతి ఫలితాలు సాధించిన ఉత్తమ పద్ధతులను ఇతర ప్రాంతాలకు విస్తరించాలని నిర్ణయించారు.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి ఫూలే

- సామాజిక విప్లవకారుడి ఆశయాలను కొనసాగిద్దాం
- సీఐటీయూ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి



**ఎల్బీనగర్, ఏప్రిల్ 11 (మనసులో మాట):** సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో వనస్థలిపురం రైతు బజార్ చౌరస్తాలో మహాత్మ జ్యోతిరావు ఫూలే 199 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ముషం నరహరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య ముఖ్యఅతిథిగా హాజరై ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక విప్లవ జ్యోతి జ్యోతిరావు ఫూలే 1827, ఏప్రిల్ 11న మహారాష్ట్రలోని సతారా జిల్లాలో జన్మించారని తెలిపారు. పదమూడేళ్లకే ఆయనకు తొమ్మిదేళ్ల సావిత్రీబాయితో వివాహం జరిగింది. పూలు సాగు చేసి అమ్మే వ్యాపారం చేస్తున్నందున వారి ఇంటి పేరు ఫూలేగా స్థిరపడింది. ఒకసారి స్నేహితుడి పెళ్లిలో కులం పేరుతో జరిగిన అవమానం ఆయన జీవితాన్ని మలుపు తిప్పి సంఘసంస్కర్తగా మార్చింది. కులవివక్షకు వ్యతిరేకంగా దళితుల హక్కుల కోసం, స్త్రీ విద్యను ప్రోత్సహిస్తూ ఆయన పోరాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి 'సత్యశోధక్ సమాజాన్ని' నెలకొల్పి సామాజిక సమానత్వాన్ని చాటారు.

### దేశంలోనే తొలి బాలికల పాఠశాల

సావిత్రీబాయి భర్త సహకారంతో సంఘ సంస్కరణ ఉద్యమాలలో చురుగ్గా పాల్గొన్నారు. ఆనాటి సామాజిక అడ్డంకులను అధిగమిస్తూ ఈ దంపతులు దేశంలోనే మొదటిసారి పుణెలో 1848లో బాలికల కోసం పాఠశాలను స్థాపించారు. అక్కడ బోధించడానికి ఉపాధ్యాయులు లేకపోవడంతో సావిత్రీబాయికి చదువు నేర్పించి టీచరుగా తీర్చిదిద్దారు. రైతులు, మహిళలు, కార్మికుల కోసం రాత్రి పాఠశాలలు ప్రారంభించారు. తరతరాల సంప్రదాయాలను సవాలు చేస్తూ ఈ దంపతులు చేపట్టిన ఉద్యమాలు ఆధిపత్య వర్గాలకు కొరకరాని కొయ్యగా మారాయి. వారి బెదిరింపులకు ఏమాత్రం భయపడకుండా వితంతు పునర్వివాహాలను సమర్థించడంతో పాటు అనాథల కోసం ఆశ్రమాలను స్థాపించారు.

### అంబేడ్కర్‌కు స్ఫూర్తిప్రదాత

ఫూలే రచించిన గులాంగిరి, తృతీయ రత్న వంటి రచనలు బహుళ ప్రాచుర్యం పొందాయి. పక్షవాతం వచ్చి శరీరం ఒక పక్క పనిచేయకపోయినా పట్టుదలతో తన చివరి పుస్తకం 'సార్వజనిక సత్య ధర్మ'ను పూర్తి చేసి 63 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచారు. ఆయన కృషికి గుర్తింపుగా రెండు తెలుగు రాష్ట్రాలలో గురుకుల పాఠశాలలకు మహాత్మా జ్యోతిరావు ఫూలే పేరు పెట్టడం విశేషం. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తన ముగ్గురు గురువులలో ఒకరిగా ఫూలేను పేర్కొన్నారు. 'మన సాంఘిక విప్లవ పితామహుడు' పేరుతో ఆయన జీవిత చరితను అంబేడ్కర్ రాశారని నేతలు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో భారతమ్మ, వరలక్ష్మి, ధనరాజ్, కాశమ్మ, మల్లయ్య, కృష్ణయ్య గౌడ్, మహేష్, స్వరూప పాల్గొన్నారు.



# కొప్పుల నర్సింహారెడ్డిని సస్పెండ్ చేయాలి

### బీజేపీ నాయకులు ముత్యం రెడ్డి డిమాండ్

**ఎల్బీనగర్, ఏప్రిల్ 11 (మనసులో మాట):** మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని సీనియర్ బీజేపీ నాయకులు ముత్యం రెడ్డి డిమాండ్ చేశారు. డెబ్బై ఏళ్లుగా పార్టీకి సేవ చేస్తున్న తనపై దాడికి దిగడం అన్యాయమని శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. మన్సూరాబాద్ డివిజన్ లో నర్సింహారెడ్డి ఆగడాలు మితిమీరిపోతున్నాయని మండిపడ్డారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డివిజన్ లో పార్టీ దిమ్మను ఏర్పాటు చేసినందుకు తనను అసభ్య పదజాలంతో దూషించి భౌతిక దాడికి పాల్పడినట్లు ముత్యం రెడ్డి ఆరోపించారు. వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేసినా రాజకీయ ఒత్తిళ్లతో మూడు రోజుల వరకు కేసు నమోదు చేయకుండా ఇబ్బంది పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు శనివారం పోలీసులు ఎఫ్ఐఆర్ కాపీ అందజేశారని తెలిపారు. డివిజన్ లో భవన నిర్మాణదారుల నుంచి నర్సింహారెడ్డి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ముత్యం రెడ్డి విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి సామ రంగారెడ్డి ఓటమికి కూడా ఈయనే ప్రధాన కారణమని పేర్కొన్నారు. పూటకో పార్టీ మారుతూ సొంత పార్టీ నేతలపైనే దాడులు చేస్తున్న నర్సింహారెడ్డిని వెంటనే బహిష్కరించాలని అధిష్టానాన్ని కోరారు. సీనియర్ నాయకులకే రక్షణ లేకపోతే సామాన్య కార్యకర్తల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.

# ఎల్బీనగర్‌లో ఫూలేకు ఘన నివాళి

### జ్యోతిరావు ఫూలే 199వ జయంతి వేడుకలు

### పాల్గొన్న జాజుల శ్రీనివాస్ గౌడ్, బీజేపీ నేతలు



**ఎల్బీనగర్, ఏప్రిల్ 11 (మనసులో మాట):** మహాత్మ జ్యోతిరావు ఫూలే 199వ జయంతి సందర్భంగా ఎల్‌బీ నగర్ సర్కిల్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి కలిసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో గుండె కిరణ్ కుమార్, కొత్త దామోదర్ గౌడ్, బొమ్మ రఘురాం నేత, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫూలేకు 'మహాత్మ' బిరుదు ఇచ్చింది ప్రజలే

### సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి

**రంగారెడ్డి జిల్లా, ఏప్రిల్ 11 (మనసులో మాట):** సామాజిక సంఘ సంస్కర్త జ్యోతిరావు ఫూలేకు ప్రజలే 'మహాత్మ' అనే బిరుదు ఇచ్చారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి అన్నారు. అంటరానితనం, కుల వ్యవస్థ రద్దు కోసం తన జీవితమంతా పోరాడిన ఫూలే 199వ జయంతి సందర్భంగా అబ్దుల్లాపూర్ మెట్ మండల సమితి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. రావి నారాయణ రెడ్డి కాలనీ ఫేజ్ 2 లోని సీపీఐ కార్యాలయంలో మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి హాజరై ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల సాధికారత, అభివృద్ధి, స్త్రీ పురుష సమానత్వం కోసం ఫూలే నిరంతరం శ్రమించారని పేర్కొన్నారు. తన భార్య సావిత్రీబాయి ఫూలేను దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిని చేసిన గొప్ప వ్యక్తి ఆయన అని కొనియాడారు. ఫూలే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆధిపత్య భావజాలం రద్దు కొరకు పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, నాయకులు అరుణ, శేఖర్, పొన్నాల యాదగిరి, నర్సింహా, యాదగిరి, మధు, వినోద్ నాయక్, ఈశ్వరయ్య, నిరంజన్, సైదులు ముదిరాజ్, ఆటో రాములు, చిర్రా కవిత, సుజాత పాల్గొన్నారు.




# జేఎన్‌ఎన్యూఆర్‌ఎం కాలనీలో ఫూలేకు నివాళి

**రంగారెడ్డి జిల్లా, ఏప్రిల్ 11 (మనసులో మాట):** మహాత్మ జ్యోతిరావు ఫూలే 199 వ జయంతి సందర్భంగా అబ్దుల్లాపూర్ మెట్టు గ్రామపంచాయతీ పరిధిలోని జేఎన్‌ఎన్యూఆర్‌ఎం కాలనీలో నివాళులర్పించారు. శాఖ కార్యదర్శి వడ్త్యా రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సీపీఐ మండల సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ హాజరై, ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు ఐతరాజు బిక్షపతి, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు సాయిలు, మాజీ కార్యదర్శి బుల్లెట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు. వీరితో పాటు మహిళా సంఘాల అధ్యక్షురాలు ఎనుగంటి లక్ష్మి, సభ్యులు ప్రియా, అన్నపూర్ణ, ప్రభాకర్, వైశాలి, మంజుల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.